
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 16 మార్చి 2024

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

ఎన్టీపీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

8లో..





మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు అమలయ్యేనా?

- నిబంధనల మార్పు, రొటేషన్‌పై తేల్చని ప్రభుత్వం
- ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మార్కెట్ కమిటీల నియామకాల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల అమలు, నిబంధనల్లో మార్పుల విషయమై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన ఉద్యమ బీఆర్‌ఎస్ పార్టీ మార్కెట్ కమిటీల నియామకాలకు సంబంధించి నూతన విధానాలను తీసుకవచ్చింది. అంతకుముందు ఎలాంటి రిజర్వేషన్లు లేకుండా చైర్మన్లను నియమించే వాళ్లు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చైర్మన్ల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్ల విధానాన్ని తీసుకవచ్చింది. పురుషులు, మహిళలకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓసీలకు రొటేషన్ విధానాన్ని అమలు చేయాలని జీవో జారీ చేసింది. మార్కెట్ కమిటీల పదవీ కాలం మొదట ఏడాది మాత్రమే ఉండగా, ఆ తర్వాత రెండేళ్ల క్రితం రెండేళ్లకు పెంచడం గమనార్హం. పదవీ కాలం ఏడాది ఉన్న వాళ్లకు మాత్రం ఆరు నెలల చొప్పున పదవీ కాలాన్ని రెండు, రెండున్నర సంవత్సరాల పాటు పొడిగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వం చేపట్టింది. అప్పటి వరకు ఉన్న మార్కెట్ కమిటీలన్నింటినీ రద్దు చేసింది. పదవీకాలం ఉన్న కొన్ని మార్కెట్ల చైర్మన్లు కోర్టును కూడా ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు తీర్పు రాకపోవడంతో అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న దాదాపు 132 మార్కెట్ కమిటీలకు నామినేటెడ్ ప్రాతిపదికన చైర్మన్, డైరెక్టర్లను నియమించాల్సి ఉంది. ఈ పదవులపై అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆశలు పెంచుకున్నారు. అయితే ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల ప్రాతిపదికన కమిటీలను నియమిస్తుందా, ఆ నిబంధనను ఎత్తేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుసరించిన విధానంలోనే చేపడుతుందా అనే విషయమై స్పష్టత లేదు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..

జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, మంథని, కమాన్‌పూర్, రామగుండంలో మార్కెట్‌లు ఉన్నాయి. వీటిని నూతన కమిటీలను నియమించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆయా మార్కెట్లకు అమలు చేసిన రిజర్వేషన్లు పోనూ పాత విధానం ప్రకారం అయితే పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి, సుల్తానాబాద్ కమిటీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి, జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి, కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీలకు, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించారు. రిజర్వేషన్లను అమలు చేస్తే ప్రకారం ఆయా కేటగిరీలకు చెందిన వాళ్లకే చైర్మన్ పదవులు దక్కనున్నాయి. ఈ దఫా ప్రత్యేకించి మహిళలకు రిజర్వేషన్ దక్క లేదు. జనరల్ కేటగిరీలో పురుషులకు గానీ, మహిళలకు గానీ చైర్మన్ పదవి ఇవ్వవచ్చు. ప్రభుత్వం రిజర్వేషన్లను అమలుచేస్తుందా, లేదా తెలియడం లేదు. రిజర్వేషన్ల ప్రకారమే చైర్మన్ పదవులను కట్టబెట్టాలని పార్టీ వర్గాలు అంటున్నాయి. మొత్తం జనరల్ చేస్తే మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చైర్మన్ పదవులు దక్కవని అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకానున్న నేపథ్యంలో ఎన్నికల తర్వాతనే మార్కెట్ కమిటీ పోస్టులను భర్తీ చేయనున్నారు.

బదిలీపై వెళ్తున్న ఏడీని సన్మానించిన కలెక్టర్



గనులు, భూగర్భ శాఖ ఏడీని సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న సాయినాథ్‌ను ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులతో కలిసి తన ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాటు సుదీర్ఘ కాలం జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, బీసీ సంక్షేమ అధికారి జాలి రంగారెడ్డి, డీఏఓ డి ఆదిరెడ్డి, డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, డీసీఓ శ్రీమాల, డీఈఓ మాధవి, పశుసంవర్ధక శాఖాధికారి రవీందర్ రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, సర్వే ల్యాండ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్‌టీఓ రంగారెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి భాస్కర్, డీఎఫ్ఓ శివయ్య, గనుల శాఖ అధికారులు రవి కుమార్, పరుశురాములు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



ప్రజా గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

సుల్తానాబాద్, మార్చి 15: మండలంలోని గర్రెపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయాన్ని విద్యార్థులు నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కాంపిటీటివ్ పరీక్షలలో రాణించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో పాత గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయాన్ని (పబ్లిక్ రీడింగ్ రూమ్)ను శుక్రవారం అరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఈ గ్రంథాయలంలో విద్యార్థులకు,నిరుద్యోగ యువతకు అవసరమున్న పుస్తకాలను, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ నోటిఫికెషన్లకు సంబంధించి పరీక్షలను రాసేందుకు అందుబాటులో అవసరమైన పుస్తకాలలను ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, ఎంపీటీసీ పులి అనూష, ఎంపీడీఓ, గ్రామ స్పెషల్ ఆఫీసర్ దివ్యదర్శన్‌రావు, ఎంపీవో ఫయాజ్‌అలీ, సెక్రటరీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారించకపోతే మనుగడ ప్రశ్నార్థకం : డీఈవో



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మాధవి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 15 : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సాధ్యమైనంతవరకు నివారించకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని డీఈవో మాధవి అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నాటిక, ఏకపాత్రాభినయం పోటీలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ కారణంగా చిన్నపిల్లలు, పెద్దవారు ఎన్నో రుగ్మతలకు లోనవుతున్నారని, పర్యావరణం కాలుష్యంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షేక్, ఎన్జీసీ జాతీయ హరిత దళం స్టేట్ ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్, జిల్లా జాతీయ హరిత దళం సమన్వయ అధికారి గూళ్ళ అంజన్ కుమార్, జిల్లా సెక్టోరియల్ అధికారులు ఐ.విజయ్ కుమార్, మల్లేష్ గౌడ్, కవిత, న్యాయ నిర్ణేతలుగా పి.సాధన, కే.మంజుల, కే.మహిపాల్ రెడ్డి, గైడ్ టీచర్స్ ఎన్‌జీసీ విద్యార్థులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణను వంద రోజుల్లోనే ఎడారి చేశారు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పాలకుర్తిలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మార్చి 15: పచ్చని తెలంగాణను కాంగ్రెస్ పార్టీ వంద రోజులు తిరక్కుండానే ఎడారిగా మార్చిందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక తిలక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రామగుండం నియోజకవర్గ ప్రాంత పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలతో అధికారంలోకి వచ్చి పదేళ్లుగా నిర్మాణం చేసుకున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్నదన్నారు. ఇప్పటికీ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో తనపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలను మొదలు పెట్టిందని ఈశ్వర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు పెంట రాజేష్, పాముకుంట్ల భాస్కర్, బొడ్డు రజిత, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, బొడ్డు రవీందర్, చెలుకలపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, పిల్లి రమేష్, గాదం నందులక్ష్మి, నూతి తిరుపతి, ఇనుముల సత్యం, కౌటం బాబు, నారాయణదాసు మారుతి, అడప శ్రీనివాస్, జక్కుల తిరుపతి, కుడుదుల శ్రీనివాస్, గుంపుల ప్రశాంత్, కోడి రామకృష్ణ, తోకల రమేష్ పాల్గొన్నారు.

అంతర్గాం : రామగుండం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంతర్గాం, రామగుండం మండలాల ముఖ్య కార్యకర్తలతో మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సమావేశం నిర్వహించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి, అంతర్గాం జెడ్‌పీటీసీ ఆముల నారాయణ, వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణఅధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, నాయకులు కౌశిక్ హరి, నడిపెల్లి మురళీధర్‌రావు, ఎంపీపీ వ్యాళ్లఅనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఇంజపురి నవీన్‌కుమార్, ఎంపీటిసి బండారి శ్రీవాణి,కో ఆప్షన్‌సర్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'మోదీ మతోన్మాద వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'

కళ్యాణ్‌నగర్, మార్చి 15: మోదీ మతోన్మాద వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు ఆరుముళ్ల తిరుపతి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 93వ వర్థంతి సందర్భంగా ఈనెల 15నుంచి 31వరకు నిర్వహించే సభలను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఫాసిజం పెరిగిపోయిందని, విద్యను కాషాయీకరణ చేయాలనే నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చారని, విద్యార్థుల్లో మతోన్మాదాన్ని పెంచి పోషించడం కోసం కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకులపై ఉపా చట్టాన్ని ప్రయోగిస్తున్నారని, ఎన్నికల నేపథ్యంలో సీఏఏను తీసుకువచ్చారని ఆరోపించారు. భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకునడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాసిపేట ధర్మేందర్, రాకేష్, సతీష్, శ్రావణ్‌కుమార్, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 15 : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవితో కలిసి సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, జిల్లావ్యాప్తంగా 7728మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, వీరి కోసం 45 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రాన్ని ముందస్తుగా పరిశీలించి విద్యార్థులకు అవసరమైన వసతులను చెక్ చేసుకోవాలని, ప్రతీ పరీక్షా కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్, సిబ్బంది తనిఖీ చేయాలని, విద్యార్థుల సీటింగ్ అరెంజ్మెంట్ ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రంవద్ద విద్యార్థుల సీటింగ్ అరెంజ్మెంట్ వివరాలను అందరికి తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, సైన్స్ పరీక్ష మాత్రం మార్చి 26,28 తేదీలలో ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు రవాణా కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఉదయం, మధ్యాహ్నం నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని, పరీక్షకు అరగంట ముందు పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు చేరుకునేలా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్‌లో తాగునీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లడానికి వీలులేదని, ఈ నిబంధన విద్యార్థులకు, పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బందికి అందరికీ వర్తిస్తుందని, పరీక్ష హాల్ లోపలికి ఎవ్వరూ సెల్‌ఫోన్ తీసుకొని వెళ్లవద్దని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోనికి అనుమతించే ముందు విద్యార్థులను తనిఖీ చేసేందుకు అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష జరుగుతున్నప్పుడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించాలని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. కేంద్రాల సమీపంలో గల జిరాక్స్ షాపులను పరీక్షా సమయంలో మూసివేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు, తదితరులుపాల్గొన్నారు.

హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 15 : వినియోగదారులు తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలిసి ఉండాలనీ అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, ఆధునిక కాలంలో నూతనంగా ఏర్పడిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని, ప్రతిఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండి సమర్థవంతంగా, జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంస్థ రూపొందించిన కరపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తెలంగాణ వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తౌటం చేతన సోనీ, రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్ కుంట, పౌర సరఫరాల శాఖ అధికారి ఎ.ప్రేమ్ కుమార్,జిల్లా లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ కె.విశ్వేశ్వర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీవైఎస్‌వో సురేష్, ఆర్‌టీవో రంగారావు, ఎల్‌డిఎం వెంకటేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందకుంటున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, మార్చి 15 : రామగుండం ఎన్టీపీలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఉన్న ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సౌర్ ఎనర్జీ ఇంటర్నేషనల్ అవార్డ్ 2024 కార్యక్రమంలో ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండుకు సౌర్ ఎనర్జీ గ్రూప్ ఎడిటర్ ప్రసన్న సింగ్ అవార్డును అందజేశారు. దేశంలోని అతిపెద్ద ఫ్లోటింగ్(నీటిలో తేలియాడే) సోలార్ ప్రాజెక్టును నెలకొల్పడం తోపాటు, సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డు లభించింది.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఘన స్వాగతం

అంతర్గాం, మార్చి 15: రామగుండం పట్టణంలోని బీ పవర్‌హౌస్ గడ్డ వద్ద బీజేపీ నాయకుడు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌కు బీఎస్‌పీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునిగా నియమితులైన రాంచందర్ మొదటిసారిగా ఢిల్లీ నుంచి గోదావరిఖనికి వస్తుండగా బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు బల్మూరి వనిత, అమరేందర్‌రావు, రావుల రాజేందర్, క్యాతం వెంకటరమణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌కు ఎన్టీపీసీ వీఐపీ గెస్ట్‌హౌస్‌లో ఈడీ కేదార్ రంజన్ పాండు ఏజెంట్ హెచ్‌ఆర్ విజయ్ కుమార్‌సిక్దర్ ఘన స్వాగతం పలికారు. అంతకు ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయనకు పలువురు ఘన స్వాగతం పలికారు.

ఆస్తి పన్ను బకాయిల వడ్డీ మాఫీపై విస్తృత ప్రచారం

- ఎన్నికల నేపథ్యంలో పార్టీల ఫ్లెక్సీలు, గోడ రాతలను చెరిపివేయాలి - రామగుండం కమిషనర్ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, మార్చి 15: ఆస్తి పన్ను బకాయిల వడ్డీ మాఫీపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, 90శాతం వడ్డీ మాఫీ పొందే అవకాశం ఉందని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మున్సిపల్ సిబ్బందిని కోరారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్ళు మెరుగుపడడానికి సహకరించాలని మెప్మా సిబ్బంది సహకరించాలని, ప్రజా పాలన దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేసి ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను నమోదు చేసి అర్హులకు విద్యుత్ జీరో బిల్లు అమలుకావడానికి సిబ్బంది సహకరించాలని సూచించారు. అలాగే గ్యాస్ సబ్సిడీ పొందడానికి ఈ కేవైసీ చేయించుకొని ఉండాలని, ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, సూపరింటెండెంట్ మనోహర్, సెక్రెటరీ రాజు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- జడ్పీ సీఈవో నరేందర్



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

రామగిరి, మార్చి 15: విధుల్లో అలసత్వంగా వ్యవహరించినట్లైయితే చర్యలు తప్పవని జెడ్‌పీ సీఈవో నరేందర్ అన్నారు. శుక్రవారం రామగిరి మండల ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేట్టారు. అనంతరం ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పనులు, కార్యచరణ పనులపై అదికారులను అడిగి తెలసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకొవాలని అదికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో సమ్మిరెడ్డి, సూపర్‌డెంట్ ఉమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 15 : ఓటరు ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షులు యాదవరాజు కోరారు. పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన నెహ్రూ యువ కేంద్రం పెద్దపల్లి సంకల్ప యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు చైతన్య కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. యాదవ్ రాజు మాట్లాడుతూ యువ ఓటర్ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని అన్నారు. దేశ ప్రగతి, అభివృద్ధి మంచి నాయకుడిని ఎన్నుకోవటం వల్ల జరుగుతుందని, కావున రాబోయే తరాలు తప్పకుండా ఓట్లు వేయడానికి బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీతారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ అశ్విని అధ్యాపకులు రవి, అఫ్రీన్, జగన్ మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కృషిచేయండి

- డీఆర్వో పవన్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 15: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్వీప్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటర్లందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాలేజీల్లో విద్యార్థులకు, స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఒక చోట తొలగించాలని, వయస్సుపై బడిన వారు కొత్తగా ఓటు నమోదుకు వస్తే పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు వివిధ అంశాలపై అధికారులు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎన్‌వైకె కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, తహసీల్దార్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

లలితాంబికా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

రాయికల్, మార్చి 15: రాయికల్ పట్టణ కేంద్రంలోని లలితాంబిక దేవాలయంలో 16 రోజుల పండుగలో భాగంగా లలితాంబికా ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం దేవాలయంలో మాతలచే బోనాలు, మంగళహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గురూజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మినేని గంగాధర్, సభ్యులు సురతాని భాగ్యలక్ష్మి, తోకల రాజేందర్, సుభాష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, మార్చి 15: వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చెగ్యాం, శాఖాపూర్, మారేడు పల్లి గ్రామాలలో ఉపాధాహామి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూ సర్వే

● ఆందోళనలో రైతులు ● భూములకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్


రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్, మార్చి 15: గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి రెవెన్యూ అధికారులు భూ సర్వే చేపట్టారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు 131.8 కిలోమీటర్లు ఎన్ హెచ్ 63ని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేగా రూపొందించడానికి రూ.3,850 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లాలో మెట్‌పెల్లి నుండి ప్రారంభమై రాయపట్నం వద్ద ముగియనున్నది. సుమారు 36 కిలోమీటర్లు మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం జరుగనున్నట్లు అధికారులు తెలిపారు.

వెల్గటూర్ మండలంలో 1.92 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం జరుగనుంది. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూ సర్వే ప్రారంభించారు. వెల్గటూర్ మండలంలో నేషనల్ సర్వే అథారిటీతో కలిసి ఆర్ఐ రాజేశ్వరి, రికార్డు అసిస్టెంట్ సంతోష్, సర్వేయర్ మహేష్‌లు సర్వే నిర్వహిస్తున్నారు. ఎక్కువ శాతం భూములు వరం గల్-రాయపట్నం రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉండడం వలన భూములకు అధిక ధర వస్తుందని రైతులు ఆనందించేవారు. కానీ ఉరుము లేని పిడుగులా రెవెన్యూ అధికారులు వచ్చి తమ భూముల్లో సర్వే పనులు చేపడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ హైవే నిర్మాణంలో తమ విలువైన భూములు పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డును నిర్మించడానికి నిర్ణయించిన రూట్‌లో కాకుండా రూట్ మార్చి తమ పొలాల మీదుగా రోడ్డు వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువ ప్రకారం ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

● గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనులు

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే విస్తరణ పనులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ప్రారంభమై పడిగల, అంక్సాపూర్, కమ్మరిపల్లి, మెట్‌పల్లి, చెల్గల్ మీదుగా జగిత్యాల, జగిత్యాల రూరల్ మండలం పొలాస, బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేట, బుగ్గారం, మద్దునూర్ గండి మీదుగా ధర్మపురి మండలం రాయపట్నం మీదుగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, శివారు లోని గోదావరి నదిని దాటుతుంది.

గోదావరి అవతలి వైపు నుంచి మోదెల, లక్షెట్టిపేట, తిమ్మాపూర్, ఇటిక్యాల్, పోతెపల్లి, గెల్లకోట, మిట్టపల్లి, హాజీపూర్, నర్సింగాపూర్, గుడిపేట, ముల్కాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగనున్నాయి.


కొత్తపల్లి శివారు భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు

రైతులు కోల్పోతున్న భూములు

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులోని వ్యవసాయ పట్టా భూములను రైతులను కోల్పోనున్నారు. వివిధ సర్వే నంబర్లలో రైతులు సుమారుగా కోల్పోయే వ్యవసాయ భూమి వివరాలు అధికారులు అంచనావేశారు. సుమారు 20 సర్వే నంబర్లలో 48 ఎకరాల భూమిని రైతులు కోల్పోనున్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో 1.92 కిలోమీటర్ల పొడవు హైవే రోడ్డు నిర్మించనున్నారు. ఎంజైమెంట్ సర్వే, సబ్ డివిజన్ సర్వే పూర్తి అయిన తరువాత రైతులు ఎంత మొత్తంలో భూమిని కోల్పోతున్నారో ఖచ్చితంగా చెప్పవచ్చని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఆయా సర్వే నంబర్ల లోని రైతులు తమ భూమి రికార్డులు అధికారులకు చూపిచాలని పేర్కొన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత ఎంజైమెంట్, సబ్‌డివిజన్ రికార్డులు ఏడీ, జిల్లా కలెక్టర్, ఆర్‌డీవోలకు పంపనున్నారు. అప్రూవల్ అయిన తరువాత అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అప్పుడు రైతులు తమ భూమి ఎంత పోతోంది అనే విషయం తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

మార్కెట్ ధర చెల్లించాలి
అనెవేని బుచ్చయ్య, రైతు

రోడ్డు నిర్మాణం కింద మా విలువైన భూములు పోతున్నాయి. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ఉన్న కాస్త భూమి పోతోంది. ప్రభుత్వం మా విలువైన భూములకు మార్కెట్ ధర చెల్లించాలి. భూములు పోతున్న రైతుల కుటుంబాలకు ఉద్యోగావకాశం కల్పించాలి.



రైతులు సహకరించాలి: తహసీల్దార్ శేఖర్

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి అధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలి. సర్వే పూర్తి అయిన తరువాత ఏడీ, కలెక్టర్, ఆర్‌డీవోలకు రిపోర్టు పంపిస్తాం. అప్రూవల్ అయ్యాక ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తారు. అప్పుడు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు. రైతుల ముందే సర్వే అధికారులకు రైతులు భూ వివరాలు ఇచ్చి సహకరిస్తే తప్పులు దొర్లకుండా ఉంటుంది.



పశువైద్యుల సంఘం డైరీ ఆవిష్కరించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మార్చి 15 : తెలంగాణ పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో 2024 సంవత్సర డైరీని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రిని సంఘనాయకులు ఘనంగా సన్మానించారు. మాచర్ల గార్డెన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో డైరీని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆనాటి ప్రభుత్వ అనాలోచిత చర్యల మూలంగా క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం చేసే పశు వైద్యులు మనోవేదనకు గురై ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విచారణను త్వరగా ముగించి పాడి, జీవాలపై ఆధారపడిన రైతులకు సేవలను విస్తరించి, తెలంగాణ రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్, విజయభార్గవ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, లింగారెడ్డి, తెలంగాణ పశు వైద్యశాస్త్ర చికిత్సకుల సంఘం అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక, సామాజికాభివృద్ధి

మహిళా డిగ్రీ కళాశాలలో స్త్రీచైతన్య సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కొర్వి వినయకళ

గణేష్‌నగర్, మార్చి 15: సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా నిలదొక్కుకునేందుకు స్త్రీలకు ఏకైకసాధనం విద్య ఒక్కటేనని గురుకుల కళాశాలల పూర్వ ప్రత్యేక అధికారి, ఆంగ్ల అధ్యాపకులు డా. కొర్వి వినయకళ ఉద్బోధించారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన చైతన్య సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న వినయకళ 'చదువు, సాహిత్యం, స్త్రీచైతన్యం' అనే అంశంపై ప్రసంగిం చారు. లింగవివక్షను కుటుంబపేదరికాన్ని ఎదురించి విజేతగా నిలబడగల శక్తి విద్య ద్వారా మాత్రమే సాధ్యమని పలు ఉదాహరణలతో విశ్లేషించి చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తూము లూరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ తాము విద్యార్థులుగా ఉన్నపుడు మహిళలకు ఇన్ని అవకాశాలు లేవని, ఇప్పటి ఆధునికతను విద్యార్థులు ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలువాలని సూచించారు. కార్యక్రమ సమన్వయకర్త తెలుగుశాఖ అధ్యక్షులు డా. మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా పనిచేస్తున్న మహిళా అధ్యాపకులను, తమ మధ్యనే ఉన్న కొందరు విద్యార్థుల జీవనగాథలను వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు నారోజు వెంకటరమణ, డా. మల్లోజల లక్ష్మణరావు, గాదెగాని పరిమళ, శ్రీరాముల తిరుపతి, షాలిని, జ్యోతి, అపర్ణ, తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్య ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, టీజీసీజీ టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా కె. సురేందర్‌రెడ్డి కళాశాల విద్యా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కళాశాల ప్రిన్సిపాల్ సంఘం అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమన్వయం సాధించడం ద్వారా కళాశాలల అభ్యున్నతికి తోడ్పడుతున్నారని అన్నారు. సమావేశంలో తెలంగాణ కళాశాల విద్య ప్రిన్సిపాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డా జీ. రాజారెడ్డి, డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి కామరాజు, నాన్ టీచింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ నాగరాజు, ప్రిన్సిపాళ్లు వై సత్యనారాయణ, కె లక్ష్మీనరసయ్య, డా సంతోష్, డా మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంజన్నకు పంచామృత అభిషేకం

కొండగట్టులో రెండో రోజు ఘనంగా పవిత్రోత్సవాలు


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 15: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో రెండో రోజు శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు ఉప నిషత్తు పారాయణం, వేదపఠనం, మూల విరాట్టుకు పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, పంచసూక్త హవనం, మహనివేధన, మంత్ర పుష్పం, శాత్తు మొర తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయం కాలం శ్రీ లక్ష్మీ సహస్రనామ పారాయాణం, కుంకుమార్చన, ఒడి బియ్యం, హనుమాన్ చాలీసా పారాయ ణలు చేశారు. అనంతరం మూల మంత్ర హవనం, పవిత్రలకు శయ్య, ఫల, పుష్పాదివాసం, బలిహరణం, నివేదన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళల్లో భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


వేములవాడ టౌన్, మార్చి 15: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


అధికారి కాత్యాయనికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న తిరుపతిరావు

రాజన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్, ఐఏఎస్ అధికారి కాత్యాయని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు


పంట పొలాల మధ్య స్వామివారి ఆలయం

ఏడుకొండలవాడికి నిరాదరణ

● నిర్లక్ష్యానికి గురవుతున్న పురాతన వేంకటేశ్వర ఆలయం
● పట్టించుకొనేవారే కరువు

మల్యాల, మార్చి 15: ఆపద మొక్కులు తీర్చే ఆ దేవుడే నిరాదరణకు గురవుతున్నాడు. ఆ దేవ దేవుడు ఇక్కడ మాత్రం శిధిల ఆలయంలో మగ్గిపోతున్నాడు. రాతితో ఈ ఆలయాన్ని నిర్మించగా, అది ఇప్పుడు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. మల్యాల మండలం లంబాడిపెల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య గల వేంకటేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. ఆలయం చుట్టూ పంట పొలాలు వెలియడంతో కనీసం ఆలయానికి వెళ్లేందుకు కూడా దారి లేకపోగా, పొలం గట్లే రహదారులు అవుతున్నాయి. సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించారని చెబుతున్న ఈ ఆలయం చుట్టూ నాడు పెద్ద గ్రామం ఉండగా, పాడి పంటలతో విరజిల్లేదని, క్రమేపి అక్కడి గ్రామం కనుమరుగవడంతో ఆలయం కూడా నిరాదరణకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఆలయ గర్భ గుడి కూలిపోతుండగా, ఆలయ రాతి స్తంభాలు చెదురుతున్నాయి. ఆలయం చుట్టూ పిచ్చి చెట్లు, మొక్కలు ఏపుగా పెరగడంతో ఆలయ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. శివలింగం, నంది విగ్రహాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

ఈ ఆలయం పూర్తిగా నిరాదరణకు గురికావడంతో భక్తులతో పాటు ఈ ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరొందిన ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. అంతేగాకుండా ఆలయానికి భూములు ఉన్నాయని, వాటిని వెలికితీయాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.


శివ లింగం, నంది విగ్రహం చుట్టు పేరుకుపోయిన గడ్డి

స్టడీ మెటీరియల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) రిక్రూట్‌మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10,000 మంది బీసీ (ఏబీడీ) అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.tsbcstudy circle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178, 040-27077929 సంప్రదించాలని సూచించారు.

రూ.7,800 పలికిన పత్తి ధర



జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 43 మంది రైతులు 497 క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్లు గొనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ. 7,800, కనిష్ఠ ధర రూ. 6300 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్లో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన రైతు మల్లయ్య

మానకొండూర్, మార్చి 15 : మండలంలోని దేవంపల్లికి చెందిన మంద మల్లయ్య (54) అనే రైతు శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా పొలం వద్ద విద్యుత్ వైరు తెగి పడి ఉండడంతో గమనించని మల్లయ్య కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

నాలుగు ఇళ్లలో చోరీ

గంభీరావుపేట, మార్చి 15: గంభీరావుపేట మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను వణికిస్తున్నాయి. సముద్రలింగాపూర్‌లో మూడిళ్లలో చోరీ సంఘటన మరవక ముందే మల్లారెడ్డిపేటలో గురువారం రాత్రి నాలుగిళ్లలో చోరీ జరిగింది. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. జక్కుల మల్లేశం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. దొంగలు మల్లేశం ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని 2 తులాల బంగారు నక్లెస్, 10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా పొన్నాల శ్రీదేవి ఇంట్లో తులం బంగారం, 20 తులాల వెండి, ఫర్జానా బేగం ఇంట్లో రూ.30 వేలు, జక్కుల బాలవ్వ ఇంట్లో అర తులం బంగారం, నగదు ఎత్తుకెళ్లారు.

పోలీసుల అదుపులో జగిత్యాల వైద్యుడు..?

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత నార్కొటిక్ డ్రగ్స్ దుర్వినియోగం కేసులో జగిత్యాల పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నార్కొటిక్ బ్యూరో, డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టి వైద్యుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. జగిత్యాలలో పాటు హైదారాబాద్‌లో ఉన్న గృహాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. జగిత్యాలకు చెందిన వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం చర్చనీయంశంగా మారింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 15: చదువురావటం లేదని మనస్తాపంతో చెప్యాల అశ్విత్‌కుమార్ (23) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో టౌన్ పోలీసులు వివరాల ప్రకారం.... హనుమాన్‌నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (సిరిసిల్ల జిల్లా) ఎల్లయ్యగౌడ్ భార్య, కూతురు, కొడుకు అశ్విత్‌కుమార్‌లతో హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అశ్విత్ కుమార్ చదువులో వెనుకబడ్డాడు. ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కాగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసి పాసయ్యాడు. పైచదువులు చదవలేకపోతున్నానని తరచుగా బాధపడేవాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అశ్విత్ కుమార్ తల్లి, సోదరి సామాను కొనుగోలుకు బ యటకు వెళ్లారు. తండ్రి ఎల్లయ్యగౌడ్ మరో గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సామగ్రితో వచ్చిన తల్లి అశ్విత్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఎత్తలేదు. భర్తకు ఫోన్ చేసి సామగ్రి తీసుకుని ఇంట్లోకి వెళ్లారు. అశ్విత్ గది తలుపులు మూసి ఉండటంతో బలవంతంగా తెరిచేసరికి అశ్విత్‌కుమార్ ఉరికి వేళాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్యగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

● ధర్మారం : యాదవ కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై మండల కేంద్రంలో గొర్రెల కాపరుల సంఘం ఆధ్వర్యంలో సీఎం రెవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జంగ మహేందర్, వేల్పుల నాగరాజు, ఆవుల మల్లయ్య, సంపత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నూనేటి సంపత్ ఉపాధిహామీ కూలీల ప్రథమ చికిత్స కిట్లను కార్యదర్శులకు అందజేశారు. ఎంపీడీవో రాంమోహన చారి, ఎంపీఓ గోవర్ధన్, ఏపీవో మంజుల, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలను తహసీల్దార్ జాహెద్ పాషా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈఓ రాజన్న, పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, టీచర్లు పాల్గొన్నారు.

● ధర్మారం : ప్రతి రోజు పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. శుక్రవారం ధర్మారంలో అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అంగన్‌వాడి సూపర్‌వైజర్ బ్లాండీన, ఎంఈవో ఛాయాదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెద్దపల్లి కల్చరల్ : ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 040-2407117, 040-27077929 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

● కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చైతన్య మానవ వేదిక స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యం లో శుక్రవారం ఏసీపీ ఎం.రమేష్ చేతులమీదుగా పరీక్ష ప్యాడ్లు అందజేశారు. సంస్థ అధ్యక్షులు కొప్పుల శంకర్, ప్రధానకార్యదర్శి నూతి సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

● జూలపల్లి : మండల కేంద్రంలో మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు జ్ఞాపకార్థం కాంగ్రెస్ నాయకుడు ఎండి అతిక్‌పాషా ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. దీకొండ రమేష్, ఎండి సమీర్, పజల్, కైలాసం, శ్రావన్, యూసుప్ ఉపేంద్రచారి పాల్గొన్నారు.

● ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కాన్షీరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాతరి పోచయ్య, జల్లి రమేష్, గుజ్జుల నర్సయ్య, కవ్వంపల్లి బాపయ్య, స్వామి, సమనపెల్లి మల్లేశం, అల్లి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు : మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగదీశ్వరచారి (55) అనే ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఎలిగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. జగదీశ్వరచారి పాఠశాల విధులు ముగించుకొని తన బైక్‌పై స్వగ్రామమైన దుర్శేడ్‌కు వెళ్తుండగా సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాల ముందు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఉన్న స్పీడు బ్రేకర్‌పై అదుపుతప్పి కింద పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు.

● కళ్యాణ్‌నగర్ : లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం హర్షణీయమని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కోకన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్, మాజీ కార్యదర్శి జక్కుల నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీకి లోపాయికారి ఒప్పందం కుదిరిందని, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపించారని, కానీ అది అవాస్తవమని, అవినీతిని చేసిన వారిని కేంద్ర ప్రభుత్వం ఉపేక్షించదన్నారు.

● కళ్యాణ్‌నగర్ : పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుండేటి రాజేష్, ప్రధాన కార్యదర్శి దాసరి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంగళ బాపు,అనుమ భద్రయ్య, దాసరి ఉమాదేవి, వెంగళ పద్మ, బూర్ల శ్రీనివాస్, నర్సయ్య, కృష్ణస్వామి, శంకరయ్య, రాజేశం, రఘు, విఠల్, శారద, రాజ్యలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ : ఓసీపీ-3 ఫేజ్-2 సీహెచ్‌పీ ఏఐటీయూసీ పిట్ కమిటీని ప్రాజెక్టు అధికారికి నాయకులు పరిచయం చేశారు. సీహెచ్‌పీ ఇంచార్జిగా సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా శ్రీనివాసరెడ్డి, సాంబయ్య, డెలిగేట్లుగా ఉదయ్‌కుమార్, పుట్ట రమేష్, వెంకటస్వామి, లక్ష్మీరాజంను నియమించినట్లు తెలిపారు.సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, సెక్రెటరీ రాజారత్నం, అన్నారావు పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి రూరల్ , మార్చి 15 : అర్హులందరికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పెద్దపల్లి పట్టణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మందికి కల్యాణలక్ష్మీ, 17మందికి షాదీముబారక్ రూ.40లక్షల 4వేల 640 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే విజయరమణరావు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేయడంతో పాటి కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా డబ్బుతో పాటు తులం బంగారం అందజేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను దశల వారిగా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌టీసీలో బస్సుల్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10 లక్షల భీమా సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరుచేసినట్లు తెలిపారు. ఇళ్లు లేనివారికి పేద కుటుంబాలకు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీపీ బండారి స్రవంతి, జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, తూముల సుభాష్‌అమరేష్, ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, నాయకులు నందనవేని రాజేందర్, కుమార్, శ్రీకాంత్, ఆర్‌బి నవీన్‌రావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే హన్మంతునిపేటలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వారి వెంట జడ్పీటీసీ రామ్మూర్తి, తిరుపతిరావు, గుజ్జుల కుమార్, వాసు, రమేష్, సతీష్, ప్రసాద్, సుధాకర్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



హన్మంతునిపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అడుగంటుతున్న భూగర్భ జలాలు



వ్యవసాయ బావిలో అడుగంటిన నీరు



పంట పొలంలో గొర్రెలు, మేకలను మేపుతున్న రైతు సదయ్య

ధర్మారం, మార్చి 15: వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంట పొలాలు ఎండుతున్నాయి. ఎస్సారెస్పీ కాలువ ద్వారా సరైన సమయాల ప్రకారం నీటి విడుదల కాకపోవడం మరో కారణంగా చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. ధర్మారం మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు ప్రస్తుతం ఎండ తీవ్రతకు సాగు నీరు అందక పంట పొలాలు నెర్రలు వారుతున్నాయి. దీంతో మొదట్లోనే పంటలు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెరువులు,కుంటల్లో కూడా సమృద్ధిగా నీరు లేకపోవడంతో మండలంలో ఎక్కడ చూసిన పంటలు ఎండిపోతున్నట్లు కనిపిస్తున్నాయి. ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. పంటలు ఎండిపోతున్న క్రమంలో పలువురు రైతులు పశువులను మేపుకోవాల్సిన పరిస్థితికి వచ్చింది. ఎస్సారెస్పీ కాలువల ద్వారా సక్రమంగా నీటిని విడుదల చేసినట్లైతే చెరువులు, కుంటల్లోకి నీరు చేరే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. అదే విధంగా ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా అక్కడక్కడా ఉన్న వాల్వులను తెరిస్తే కూడా పంటలకు సాగు నీరు అందుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కనుక కొనసాగినట్లైతే సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సక్రమంగా నీటిని విడుదల చేయాలని, కోరుతున్నారు. అదేవిధంగా ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పశుగ్రాసంగా మారుతున్న పంటపొలాలు

పాలకుర్తి, మార్చి 15: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల పంట పొలాలకు నీరులేక ఎండిపోతున్నాయి. శుక్రవారం కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లెత్తుల సదయ్య అనే రైతు వరి పంట ఎండిపోతుండడంతో గొర్రెలు, మేకలను మేపాడు. మండలంలోని పలువురు రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు స్పందించి డి83, 17ఎల్, 4ఆర్‌ఆర్ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి రైతులు కోరుతున్నారు.

ఎన్టీపీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జ్యోతినగర్, మార్చి 15 : ఎన్టీపీసీ కార్మికుల సమస్యల పరిశ్రామే తన లక్ష్యమని ఎన్టీపీసీ జాతీయ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సభ్యుడు, వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బాబర్ సలీంపాషా అన్నారు. ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడుగా నియమితులైన బాబర్ శుక్రవారం గుర్తింపు మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్టీపీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం పోరాడుతున్నానని, భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో పని చేస్తానన్నారు. ఏప్రిల్ 16 నుంచి 19 వరకు ఇండోనేషియా రాజధాని జకర్తాలో జరిగే ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్‌వో) సదస్సులో తాను పాల్గొంటున్నానని బాబర్ తెలిపారు. భారతదేశం నుంచి తానొక్కన్నే ఐఎల్‌వో సదస్సులో పాల్గొంటున్నానని తెలిపారు. సమావేశంలో ఎన్టీపీసీ గుర్తింపు యూనియన్ నాయకులు బండారు కకనకయ్య, ఆరెపల్లి రాజేశ్వర్, వెంకటస్వామి, కందుల స్వామి, రవికుమార్, రమేష్, వెంకట్ రెడ్డి, వేముల కృష్ణయ్య, బాస్కర్ యాదవ్, గోపాల్‌రావు, సంజీవరావు, కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఎన్టీపీసీ ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన బాబర్ సలీం పాషాను శుక్రవారం ఐఎన్‌టీయూసీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. గుర్తింపు కార్మిక సంఘం, కాంట్రాక్టు కార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు బాబర్‌ను సత్కరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

ఎస్సారెస్పీ తూము షట్టర్ చోరీ

ఓదెల, మార్చి 15 : ఓదెల శివారులోని డి86 ఎస్సారెస్పీ కాలువకు ఉన్న తూము షట్టర్ చోరీకి గురైనట్లు ఎస్సారెస్పీ ఏఈ రాజు పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రధానకాలువ నుంచి మడక ఓదెల శివారు భూములకు సాగునీటిని అందించేందుకు అధికారులు గతంలో ఈ తూమును ఏర్పాటు చేశారు. మడకవైపు వెళ్లే తూము నుంచి అధికంగా నీటిని తీసుకెళ్లేందుకు కొందరు వ్యక్తులు షట్టర్‌ను ఎత్తుకెళ్లినట్లు పొత్కపల్లికి చెందిన వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఎస్సారెస్పీ ఏఈ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ

పెద్దపల్లి రూరల్, మార్చి 15 : మండలంలోని మారేడుగొండలో గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరానికి ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.ఏ సమద్, అధ్యాపకులు సదానందం, ఆమని, విద్యార్థులు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాల అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం

రామగిరి, మార్చి 15: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలో అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన 13 మంది ఉద్యోగుల డిపెండెంట్లకు శుక్రవారం కారుణ్య నియామక పత్రాలను జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, రాజేందర్, రవీందర్‌రెడ్డి,మారుతీ, గుర్రం శ్రీహరి, నాయకులు డిటి రావు, శ్రీనివాస్‌రావు, గ్రంధిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి వసతులు కల్పించాలి

రామగిరి, మార్చి 15: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు వేసవిలో మజ్జిగ ప్యాకెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, షెల్టర్స్ తాగునీటి వసతిని కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న శుక్రవారం ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం రఘుపతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, చంద్రమోహన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేసినందుకు కృతజ్ఞతలు

గోదావరిఖని, మార్చి 15: సింగరేణిలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న 813 అంతర్గత ఖాళీలను భర్తీ చేయడానికి సీఎండీ బలరాంనాయక్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షనీయమని టీబీజీకేఎస్ నాయకులు చెల్పూరి సతీష్ అన్నారు. సింగరేణి సంస్థలో ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఈ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారని, ఇందులో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, క్లర్క్‌లు, జూనియర్ మైనింగ్ ఇంజనీర్లు, అండర్ మేనేజర్ పోస్టులు, నాన్ క్యాడర్ క్లర్క్‌ల పోస్టులను విడుదల చేయడం కార్మికుల్లో ఉత్సాహం నెలకొన్నదని, సింగరేణి యువ కార్మికుల పక్షాన బలరాం నాయక్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

367 ఎక్స్‌టర్నల్, 813ఇంటర్నల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

గోదావరిఖని, మార్చి 15: సింగరేణిలో ఖాళీగా ఉన్న 367 ఎక్స్‌టర్నల్, 813ఇంటర్నల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆర్‌సీకే బసవయ్య ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ ఈఅండ్‌ఎం పోస్టులు 42, మేనేజ్‌మెంట్ ట్రైనీ సిస్టం ఏడు పోస్టులు, నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో జూనియర్ ఇంజనీర్ ట్రైనీ జేఎంఈటీ పోస్టులు 100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ మెకానికల్ ట్రైనీ పోస్టులు 9, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ 24, ఫిట్టర్ ట్రైఊనీ పోస్టులు 47, ఎలక్ట్రికల్ ట్రైనీ పోస్టు 98 మొత్తం 327పోస్టులు ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ నంబరు 02/2024లో ఉన్నాయని, ఈ పోస్టులకు ఏప్రిల్ 15 నుంచి మే 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అంతర్గత పోస్టుల్లో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టులు 22, అండర్ మేనేజర్ పోస్టులు 20, జూనియర్ అకౌంట్ పోస్టులు 6, నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 360, జూనియర్ మైనింగ్ ఇంజనీంగ్ ట్రైనీ జేఎంఈటీ 100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ మెకానికల్ ట్రైనీ పోస్టులు 10, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ పోస్టులు 25, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 123, ఎలక్ట్రిషియన్ ట్రైనీ పోస్టులు 133, వెల్డర్ ట్రైనీ పోస్టులు 14 మొత్తం 813 నోటిఫికేషన్‌లో ఉన్నాయని, ఈ పోస్టులకు మార్చి 20 నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, పూర్తి వివరాలకు సింగరేణి వెబ్‌సైట్‌లో చూడవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ మొత్తం 1140 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడం జరిగిందని, ఇవే కాక ఈ నెల 6న అంతర్గత అభ్యర్థుల కొరకు 173పోస్టులు, గత నెల 22న 272 ప్రత్యక్ష నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని చెప్పారు. అంతేకాకుండా 60ఈపీ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు, ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న 200పోస్టులను ప్రమోషన్ పద్ధతిలో భర్తీ చేస్తామని చెప్పారు. వ్రాత పరీక్ష ఆధారంగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్ కానీ, ఫోన్ ద్వారా కానీ ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురి చేస్తే నమ్మవద్దని, వెంటనే ఏసీబీకి కానీ, సింగరేణి సంస్థ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇంటర్నల్ కార్మికులకు ఉన్నత స్థాయి ఉద్యోగ మేళా : సీఎండీ

సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్‌లుగా, జనరల్ మజ్దూర్లుగా భూగర్భగనుల్లో పని చేస్తున్న విద్యావంతులైన యువ కార్మికులకు ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందటానికి సంస్థ గొప్ప అవకాశాన్ని అందిస్తోందని సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను జారీ చేశారు. వివిధ విభాగాల్లో ఏర్పడిన 986 ఖాళీల భర్తీ కోసం సంస్థలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ రెండు ఇంటర్నల్ నోటిఫికేషన్లను ఇటీవల జారీ చేసింది. ఈ పోస్టుల్లో 204 అధికార హోదా పోస్టులు కాగా, 782 టెక్నీషియన్, కార్మిక స్థాయి పోస్టులు ఉన్నాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా కూడా 599 పోస్టుల భర్తీకి రెండు ప్రకటనలు జారీ చేసింది. వీటిలో మొదటి ప్రకటనలో 272 ఉద్యోగాలు, రెండో ప్రకటనలో 327 ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరినట్టు సీఎండీ తెలిపారు. ఉన్నత స్థాయి చదువులు డిగ్రీలు కలిగి ఉన్న ఇన్ సర్వీస్ కార్మికులకు ఇది గొప్ప అవకాశం అని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనుక్షణం భద్రతతో పనిచేయాలి : జీఎం సేఫ్టీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 15: విధుల్లో అనుక్షణం భద్రతతో పనిచేయాలని సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య ఓసీపీ-1 అధికారులకు సూచించారు. శుక్రవారం గురువయ్య ఓసీపీ-1 ప్రాజెక్టును తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులతో గురువయ్య మాట్లాడారు. ప్రాజెక్టుకు కేటాయించిన లక్ష్యాలను సాధించే క్రమంలో రక్షణ పాటించాలని సూచించారు. భారీ యంత్రాలపై పనిచేసే ఉద్యోగులు ప్రమాదాలు జరగకుండా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. ఉత్పత్తిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఓసీపీ-1 ప్రమాద రహిత ప్రాజెక్టుగా నిలపాలని సూచించారు. గురువయ్య వెంట పీఓ రాధాకృష్ణ, ఇంచార్జి మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కోటయ్య, సర్వే ఆఫీసర్ డీవై శెట్టి ఉన్నారు.

ఓసీపీ-1ను సందర్శించిన జీఎం ఆర్‌అండ్‌డీ

ఓసీపీ-1 ప్రాజెక్టును శుక్రవారం సింగరేణి ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని సందర్శించారు. ప్రాజెక్టు వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. భద్రత, నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తీసుకుంటున్న చర్యలపై ప్రాజెక్టు అధికారులను అడిగి సుభాని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వివిధ అంశాలను జీఎం సుధాకర్‌రావు, పీవో రాధాకృష్ణలు ఆర్‌అండ్‌డీ జీఎం సుభానికి వివరించారు. సుభాని వెంట జీఎం, పీవో, పీఈ శ్రీనివాస్, ఓసీపీ-1 అధికారులు ఉన్నారు.



ఉద్యోగులకు రక్షణపై సూచనలు చేస్తున్న గురువయ్య

రామగిరిలో 'శ్రీపాద బంధం'కు శ్రీకారం

రామగిరి, మార్చి 15: మండలంలో 'శ్రీపాద బంధం' అనే వినూత్న కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల రోజు ఉచితంగా 20మందికి భోజనం సరఫరా చేయాలనే సంకల్పించారు. అందులో భాగంగా శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు శ్రీపాద బంధం వ్యవస్థపాక అధ్యక్షుడు వేదాంతం పవన్ కుమార్ నేతృత్వంలో మండలంలోని కల్వచర్లకు చెందిన కురుమల్ల భూమయ్య గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులు 15మందికి అన్నం పార్సిల్స్‌ను అందజేశారు. కాగా, భూమయ్య నేత్రాలను అతడి కొడుకు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ టెక్నీషియన్ లక్ష్మణ్ నేత్రాలను సేకరించి ఎల్వీ ఆసుపత్రికి తరలించారు. మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకట రమణారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు నుక రమేశ్, దొంతుల సురేష్, బూస అజయ్‌పటేల్, కురుమల్ల రాజయ్య, బిరుదు సంతోష్, కురుమల్ల భూమయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

సుల్తానాబాద్, మార్చి 15: పట్టణ ప్రజల తక్షణ అవసరాలు తీర్చడంలో ప్రాముఖ్యత ఇస్తూ దశల వారీగా ప్రజలకు మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ గాజులలక్ష్మీ రాజమల్లు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాల, శాస్త్రినగర్‌లో రూ 14 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, ఒక లక్షతో హైమాస్ లైట్ల ఏర్పాటుకు సంబంధించిన అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, కమీషనర్ వేణుగోపాల్, కౌన్సిలర్‌లు తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి, చింతల సునిత రాజు, రాజయ్య, సిద్ధ తిరుపతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేగోలం అబ్బయ్య గౌడ్, రాజయ్య, మొండయ్య, వల్స చందు తదితరులు పాల్గొన్నారు.

పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సుల్తానాబాద్, మార్చి 15: సుల్తానాబాద్ పట్టణంలోని పెరికిగిద్దె ఆంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన ధర్మకర్తల మండలి సభ్యులతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుజాతరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు కత్తెర్ల పోచమల్లు, కోట శ్రీనివాస్, సాయిరామ్, పిడుగు విమల, అర్చకులు కొండపలుకల అభిలాష్‌లు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చైర్మన్‌గా రామేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, ఎంపీపీ బాలాజీ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పల్లా మురళి, మినుపాల ప్రకాశ్‌రావు, సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, అన్నయ్య గౌడ్,పెద్దన్న పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ టికెట్ వంశీకృష్ణకు ఇవ్వాలి'

పెద్దపల్లిటౌన్, మార్చి 15: పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వునుకొండ శ్రీధర్ పటేల్ అధిష్టానాన్ని కోరారు. పెద్దపల్లిలో శుక్రవారం మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు సజ్జాద్‌తో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాకా వెంకటస్వామి కుటుంబంతో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవలందించేందుకు వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బాలసాని సతీష్ గౌడ్, ఉనుకొండ భూమయ్య, వైకుంఠం, అడ్డగుంట శ్రీనివాస్, ఇమ్రాన్, కోతుల ప్రవీణ్, కోరం నరేందర్‌రెడ్డి, బండి రాజు, అనుమాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ మీట్‌లో ఖని పీజీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో పీజీ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, మార్చి 15: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో ఈ నెల 14న డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ విభాగం నిర్వహించిన వికల్ప-24 కామర్స్‌మీట్‌లో గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. విద్యార్థులకు వికల్ప-24 కన్వీనర్ డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అర్చన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్, అధ్యాపకులు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మారం,మార్చి15: మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న దొంగలి శివకుమార్‌కు గురువారం తన తండ్రితో కలిసి మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని పెద్దయ్య గుడికి వెళ్లాడు. అక్కడ ఓ సెల్‌ఫోన్ దొరికింది. శివకుమార్ శుక్రవారం ఉదయం ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఈ సెల్‌ఫోన్ ఎవరిదనే కోణంపై విచారించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతె గ్రామానికి చెందిన దయ్యాల లింగయ్యదిగా గుర్తించారు. వెంటన్నే అతడిని ఠాణాకు పిలిచి విద్యార్థి శివకుమార్ చేతుల మీదుగా దొరికిన సెల్‌ఫోన్‌ను ఆయనకు అప్పగించారు. విద్యార్థిని ఎస్సై సత్యనారాయణ, పోలీసులు పలువురు ప్రశంసించారు.

ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు

పాలకుర్తి,మార్చి 15: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో శుక్రవారం ఆలయ ఫౌండేషన్-శంకర్ విజన్ సెంటర్ వారు ఉచితకంటి వైద్య శిబిరం నిర్వహించారు.హైదరబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యబృందం అత్యాధునిక సాంకేతిక పరికరాలతో 150మందిని పరీక్షించి 100 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరం ఉందని గుర్తించారు. ఇందులో నుంచి 60 మందిని హైదరాబాద్‌లోని శంకర్ విజన్ సెంటర్‌కి తరలించామని ఆసుపత్రి ఇన్‌చార్జి పరికిపండ్ల రాము తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిసనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడారు. ఆలయ శంకర్‌కంటిఆసుపత్రి సిబ్బంది, వలంటీర్స్ మిట్టపెల్లి రాజేందర్,కీర్తి నాగార్జున, కన్నం తిరుపతి, కన్నం వెంకటేష్, బండి శ్రీనివాస్, పరికిపండ్ల సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

కోల్‌సిటీటౌన్, మార్చి 15: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తల్లిదండ్రులను ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి విద్యార్థి చైతన్య పరచాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. ఎన్నికల కమిషన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోదావరిఖని అశోక్‌నగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకుంటానని ప్రతిజ్ఞ చేయడానికి ఉద్దేశించిన సంకల్ప పత్రాలు తమ తల్లిదండ్రుల సంతకాలతో ప్రతి విద్యార్థి తీసుకురావాలన్నారు. మత, జాతి, కుల, వర్గ, భాష తదితర ప్రేరేపణలకు ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, నిజాయితీగా ఓటు వేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, మార్చి 15: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని లైఫ్‌లైన్ ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో 150మందికి వివిధ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరం ఉన్న వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, డాక్టర్ శ్రీలత, భిక్షపతి, కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.